ప్రజాశక్తి
శనివారం 23 సెప్టెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

7 రోజులు.. 85,459 ఎకరాలు

- ముగుస్తున్న ఈ - క్రాప్ గడువు
- 64 శాతం నమోదు
- సమయం పెంచకపోతే నష్టపోనున్న రైతులు

ఈ - క్రాప్ నమోదును పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఈ - పంట (ఎలక్ట్రానిక్ క్రాప్) నమోదుకు గడువు మరో వారం రోజులే వుంది. సాంకేతిక సమస్యలకు తోడు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు ఓటర్ల జాబితా పని అప్పగించడంతో ఈ - క్రాప్ పని ఆశించిన స్థాయిలో జరగలేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,36,093 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. దీనిలో 1,50,634 ఎకరాలకు సంబంధించిన 1,10,410 మంది రైతుల పంట వివరాలు ఈ - క్రాప్ నమోదుచేశారు. ఇంకా 85,459 ఎకరాల పంట నమోదుచేయాల్సివుంది. ఈ - క్రాప్ నమోదుకు ఈ నెల 30తో గడువు ముగియనుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయశాఖ గత నెలలో ఈ - క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటికి 64 శాతం మాత్రమే నమోదైంది. నెల రోజుల్లో సగటున రోజుకు ఐదు వేల ఎకరాలు ఈ - క్రాప్ చేశారు. ఇక ఈ నెలలో మిగిలిన ఏడు రోజుల్లో 36 శాతం పూర్తి చేయాల్సివుంది. రోజుకు 12 వేల ఎకరాలకుపైగా నమోదు చేయగలిగితే 85,459 ఎకరాల పంట ఈ - క్రాప్ అవుతుంది. శత శాతం ఈ - క్రాప్ నమోదు పూర్తికాకపోతే వేలాది మంది రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ యాధారిత పథకాలకు దూరం కానున్నారు.

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల మధ్య ఒడిదుడుకులను తట్టుకొని రైతులు పంటలు సాగుచేస్తున్నారు. గడువులోగా పంటలు ఈ - క్రాప్ జరగకపోతే సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట కొనుగోలు వంటివి రైతుకు వర్తించే అవకాశంలేదు. రైతుకు ప్రభుత్వ పరమైన పథకాలు వర్తింపచేందుకు ఈ - క్రాప్ నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నెలాఖరులోగా ఈ - క్రాప్ పూర్తికాకపోతే ప్రభుత్వ సాయం రైతుకు అందే అవకాశంలేదు. వాస్తవానికి ఈ నెల 15లోపు ఈ - క్రాప్ నమోదు పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు విధించింది. వర్షాభావ పరిస్థితులతో పంటలు సాగుకాకపోవడంతో పంట నమోదు గడువును ఈ నెలాఖరుకు పెంచింది. అయితే, పంట నమోదు చేయాల్సిన వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందికి ఓటర్ల మిగతా 2లో..

విఎంఆర్‌డిఎ
భూ అమ్మకాలు ఉపసంహరించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎ వేలం ద్వారా 87.80 ఎకరాల భూమిని అమ్మేయాలని ప్రకటించడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గ నాయుడు ఖండించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణమే అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధురవాడ గాయత్రి మెడికల్ కాలేజీ వెనుక 421 సర్వే నెంబర్‌లో వున్న కొండ మొత్తాన్ని ఈ - వేలం ద్వారా రియల్టర్లకు కట్టబెట్టాలని నిర్ణయించారని, మొత్తం భూమిని 14 విభాగాలుగా చేశారని తెలిపారు. సుమారు రూ.1100 కోట్లు అప్‌సెట్ ధరగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విఎంఆర్‌డిఎను రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చేస్తోందని మండిపడ్డారు. ఈ విధానం వల్ల విశాఖలో భూముల ధరలు మరింత పెరుగుతాయన్నారు. మధ్య తరగతి ప్రజలు ఇల్లు సమకూర్చుకోలేని పరిస్థితి ఇప్పటికే ఏర్పడిన విషయాన్ని గుర్తుచేశారు. తాజాగా తీసుకున్న చర్య రియల్ ఎస్టేట్ సంస్థలకు, సంపన్నులకు మేలుచేసేదని తెలిపారు. వాస్తవంగా విఎంఆర్‌డిఎ సంస్థ దిగువ, మధ్య తరగతి ప్రజల కోసం భరించగలిగిన రేట్లలో ఇళ్ల నిర్మాణం చేయడం, మిగతా 2లో..

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లోని బాపట్ల స్టేషన్‌లో మూడో లైన్‌కు సంబంధించి ప్రీ-నాన్ ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. ఈ మేరకు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 22708 తిరుపతి - విశాఖపట్నం డబుల్ డెక్కర్‌ను అక్టోబర్ 4, 6, 8 తేదీల్లోనూ, 22707 విశాఖపట్నం - తిరుపతి డబుల్ డెక్కర్‌ను అక్టోబర్ 5, 7, 9 తేదీల్లోనూ, 02809 భువనేశ్వర్ - తిరుపతి ఎసి సూపర్ ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 30, అక్టోబర్ 7 తేదీల్లోనూ, 02810 తిరుపతి - భువనేశ్వర్ ఎసి సూపర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 1, 8 తేదీల్లోనూ, 22871 భువనేశ్వర్ - తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 8న, 22872 తిరుపతి - భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అక్టోబర్ 9న, 22869 విశాఖపట్నం - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 25, అక్టోబర్ 2, 9 తేదీల్లోనూ, 22870 ఎంజిఆర్ చెన్నై మిగతా 2లో..

గుర'జాడ' అనుసరణీయం

వార్త 2లో..

జాతీయ స్థాయి చెస్ టోర్నీ లోగో ఆవిష్కరణ

వార్త 8లో..

విమ్స్‌కు 27 మంది వైద్యులు

వార్త 8లో..

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న ఐద్వా కార్యకర్తలు

స్ఫూర్తిదాయకం.. ఉక్కు పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రెండేళ్లకుపైగా సాగుతున్న ఉద్యమం ఎంతో స్ఫూర్తిదాయకమైందని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 902వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ నాటి విశాఖ ఉక్కు ఆవిర్భావ పోరాటాన్ని మిగతా 2లో..

షిప్ బిల్డింగ్‌తో ఉపాధి అవకాశాలు

ఫ్యాప్సీ ఇంటర్నేషనల్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో వక్తలు

సదస్సులో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : నౌకల నిర్మాణం, మరమ్మతుల విభాగంలో అద్భుతమైన ఉపాధి అవకాశాలున్నాయని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. విశాఖలోని దసపల్లా హోటల్‌లో శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యాన షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకూ 'లాజిస్టిక్ సామర్థ్యం పెంపు' అంశంపై సెషన్ నడిచింది. ఎంఎస్ఎంఇ పార్కుల అభివృద్ధి, రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు, గ్రీన్ ఫీల్డ్ ఎనర్జీ వంటి ఇండస్ట్రీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై జెఎస్‌డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ డైరెక్టర్, సిఇఒ ఆర్.కనకరావు మాట్లాడారు. ఎంఎస్ఎంఇలకు పవర్ సప్లయ్‌ను జెఎస్‌డబ్ల్యు సంస్థ ఎంతగానో అభివృద్ధి చేసిందన్నారు. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సాంబశివరావు ఈ సెషన్‌కి మోడరేటర్‌గా వ్యవహరిస్తూ షిప్పింగ్ బిజినెస్‌లో బెర్త్ కోసం నౌక వేచిచూసినా పర్వాలేదుగానీ షిప్ కోసం బెర్త్ వేచి చూసేలా ఉండకూడదంటూ వ్యాఖ్యానించారు. షిప్ బిల్డింగ్ రంగంలో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. విశాఖపట్నం లాంటి తీర ప్రాంతాలతో కూడిన నగరాలు మంచి అభివృద్ధి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

7 రోజులు.. 85,459 ఎకరాలు

జాబితా పనులు అప్పగించడంతో గడువులోగా ఈ - క్రాప్ పూర్తిచేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఈ - క్రాప్ నమోదు గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు. గడువులోగా ఈ - క్రాప్ నమోదు పూర్తిచేస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహన్‌రావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. పంటల వివరాలన్నీ ఈ - క్రాప్ జరిగేలా తగిన చర్యలు తీసుకున్నామన్నారు.

విఎంఆర్‌డిఎ భూ అమ్మకాలు ఉపసంహరించాలి

చిన్న, చిన్న ప్లాట్స్ వేసి ఇవ్వడం వంటి పనులు చేయాలన్నారు. అలాగే పట్టణ భూమి స్పెక్యులేషన్ కాకుండా నియంత్రించే చర్యలు చేపట్టాలన్నారు. కానీ వీటికి తిలోదకాలిచ్చి రియల్ ఎస్టేట్‌కు కొమ్ముకాస్తోందని విమర్శించారు. ప్రజల అవసరాలకు ఉపయోగించాల్సిన భూమిని సంపన్నులపరం చేయడం తగదన్నారు. తాజా చర్యల వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.

జివిఎంసి కార్యాలయాన్ని తరలించొద్దు

రాష్ట్ర ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం దసరా నుంచి విశాఖలో ఆరంభంకానున్నట్టు ప్రకటించిన విషయాన్ని జగ్గునాయుడు గుర్తుచేస్తూ.. రాష్ట్ర కార్యాలయాల కోసం జివిఎంసి ప్రధాన కార్యాలయాన్ని ముడసర్లోవకు తరలించాలనే ప్రయత్నం జరుగుతున్నట్టు తెలుస్తోందన్నారు. ఇది తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. తక్షణం ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

సెంట్రల్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 26, అక్టోబర్ 3, 10 తేదీల్లోనూ, 08311 సంబల్పూర్ - ఈరోడ్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 27, అక్టోబర్ 4 తేదీల్లోనూ, 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 29, అక్టోబర్ 6 తేదీల్లోనూ, 08543 విశాఖపట్నం - బెంగుళూరు కంటోన్మెంట్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 24, అక్టోబర్ 1, 8 తేదీల్లోనూ, 08544 బెంగుళూరు కంటోన్మెంట్ - విశాఖపట్నం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 25, అక్టోబర్ 2, 9 తేదీల్లోనూ రద్దు చేశారు.

13351 ధన్‌బాద్-అలెప్పి బొకారో ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు సాధారణ మార్గమైన తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా కాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తుంది.

స్ఫూర్తిదాయకం.. ఉక్కు పోరాటం

గుర్తుచేశారు. చారిత్రక పోరాట నేపథ్యమున్న స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం అమ్మేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. ఉక్కు ఉద్యమాన్ని తదేక స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లడం గొప్ప విషయమని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలే దేశానికి పట్టుగొమ్మలన్న విషయాన్ని మరువరాదన్నారు. ఈ నెల 29న ఉక్కు నగరంలోని త్రిష్ణా మైదానంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, నాయకులు ఆర్.వరలక్ష్మి, కె.మణి, ఎ.పుష్పాంజలి, సాహూ, కె.వేణు, కె.అనురాధ, బి.భారతి, శారద, ఎ.సంజు, లక్ష్మి పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం కూడలి వద్ద..

ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు శుక్రవారానికి 953వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగం కార్మికులు కూర్చున్నారు. ఎన్.గోవిందరావు, జి.విశ్వేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, వి.రమణ, గంటా రామారావు, ఈశ్వరరావు, రంగయ్య నాయుడు, సంతోష్, పివి.రమణ, సలాది శ్రీను, రామన్న పాల్గొన్నారు.

షిప్ బిల్డింగ్‌తో ఉపాధి అవకాశాలు

అవకాశాలను కలిగి ఉంటాయని, విశాఖ వ్యూహాత్మక భౌగోళిక స్వరూపం వ్యాపారానికి, మౌలిక వసతులకు కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. ఎపి మారిటైం బోర్డు డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బిఎం.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సరుకుల రవాణా ఎగుమతి, దిగుమతుల్లో పోర్టులు ఎపిలో నిర్వహిస్తున్న కీలక పాత్రను వివరించారు. ఈ సదస్సులో ఐసిఐసిఐ బ్యాంక్ విశాఖ ప్రతినిధి వికాస్ అగర్వాల్ వ్యాపారం, లాజిస్టిక్ అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్ మాట్లాడుతూ షిప్ బిల్డింగ్ గొప్ప ఉపాధికి ఆస్కారమిచ్చే రంగమన్నారు. టగ్‌ల ప్రాధాన్యతను వివరించారు. ఒక నౌక రిపేరు కోసం వస్తే ఎంత సమయం పడుతుందో అంచనా వేయాలని తెలిపారు. అలాగే కొత్తగా నిర్మాణం చేపడితే ఎంత కాలం పడుతుందన్న అంచనాలతో షిప్పింగ్ లాజిస్టిక్ అభివృద్ధి కూడా ఆధారపడి ఉంటుందని అన్నారు. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఎపి కీలక కేంద్రంగా ఉందన్నారు.

జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఆంధ్రా మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీలో వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులను ఉద్దేశించి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడారు.

పిఐడబ్ల్యు నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిజెపి ప్రభుత్వం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు గాలి బుడగ వంటిదని పిఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి విమర్శించారు. బిజెపి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం తలపెట్టిన నిరసనలో ఆమె మాట్లాడారు. తాజా బిల్లు ఓట్లు కొల్లగొట్టడానికి ఉద్దేశించి తప్ప వాస్తవంగా మహిళలకు హక్కులను కల్పించేది కాదన్నారు.

గుర'జాడ' అనుసరణీయం

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న వక్త

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సాంఘిక దురాచారాలను వ్యతిరేకించిన గురజాడ మాట సదా అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు గురజాడ సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ముఖ్య అతిథులుగా చిత్రకళా పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైనార్ట్స్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ శిష్టా శ్రీనివాస్, చిత్రకళా పరిషత్ జాయింట్ సెక్రటరీ డి.మనోహర్, ఎన్.నాగేశ్వరరావు పాల్గొని గురజాడ రచనల్లోని విశిష్టతను తెలియజేశారు. ఆనాడు పాతుకుపోయిన సాంఘిక దురాచారాలైన బాల్య వివాహాలు, కన్యాశుల్కాలను దునుమాడుతూ గురజాడ చేసిన రచనలను వివరించారు. తదనంతరం గురజాడ కవిత 'దేశభక్తి గేయం'లోని చరణాలపై స్కూల్ పిల్లలకు నిర్వహించిన చిత్ర కళా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అల్లూరి విజ్ఞాన కేంద్రం ఇన్‌ఛార్జి జివిస్.రాజేశ్వరరావు, గురజాడ సాంస్కృతిక కేంద్రం ఇన్‌ఛార్జి దండు నాగేశ్వరరావు, షార్ట్ ఫిల్మ్ విభాగం ఇన్‌ఛార్జి ఎల్లాజీ, బివిఆర్ ఫౌండేషన్ ఇన్‌ఛార్జి బుజ్జి నాయకత్వం వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేయగా సభకు హాజరైన వారంతా గురజాడ దేశభక్తి గేయాన్ని సామూహికంగా ఆలపించడంతో సభ ప్రారంభమైంది.

సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, సాహితీ స్రవంతి, లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె.నిర్మల అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు మాట్లాడుతూ తన రచనల ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడానికి గురజాడ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, గేయ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ద్వితీయ భాషల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పికె.జయలక్ష్మి, లయన్స్ క్లబ్ సెక్రటరీ పిజి.లక్ష్మీనారాయణ, కన్వీనర్ కెఎస్.స్వతంత్ర కుమార్, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు, అధ్యాపకులు డాక్టర్ కె.గౌరి నాయుడు, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, డాక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని బీచ్ రోడ్‌లో ఉన్న గురజాడ అప్పారావు విగ్రహానికి సాహితీ స్రవంతి ఆధ్వర్యాన పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెంటకోట రామారావు, దండు నాగేశ్వరరావు, పెంటకోట వెంకటరావు, జివి.రమణ, ప్రదీప్, బిఎల్.నారాయణ, స్వతంత్ర కుమార్, ఎవిఆర్‌కె.మూర్తి, లయన్స్ క్లబ్ లక్ష్మీనారాయణ, చలపతి పాల్గొన్నారు.

చోడవరం : గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గురజాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

మాటూరి దుర్గ మాధురి, సంబరు మౌనిక, మాదాల రమేష్, పోర్ల మల్లేశ్వరి, ఆరిపాక రేవతి, అనిమిరెడ్డి అఖిల పోటీల్లో గెలుపొందారు. వీరికి జన విజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తాలపరెడ్డి నాగచంద్ర, జిల్లా కార్యదర్శి గొరిపట్టపు మహేష్ కుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల ఉపాధ్యక్షులు జాగని ఈశ్వరరావు, కార్యదర్శి సులోమోన్, కోశాధికారి చిన్నం నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ఎస్.శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ జి. జయలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జులై 2023 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూర విద్యా కోర్సులతో పాటు ఆన్లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకూ పెంచినట్టు వర్సిటీ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తోన్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు సెప్టెంబర్ 30 వరకూ లభిస్తాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికిగానూ ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులు ప్రవేశపెట్టామన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ విశాఖ అక్రిడియేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (వియడబ్ల్యూహెచ్ఎస్) సభ్యులు వైసిపి రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జర్నలిస్టులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ మీడియా రంగంలో రాణిస్తున్నారని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల కేటాయింపు డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. 2006 నుంచి 2023 వరకూ ఉన్న అక్రిడియేటెడ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని కోరారు. సుమారు 18 ఏళ్లుగా విశాఖలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు జరగలేదని వివరించారు. వైసిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో జర్నలిస్టులకిచ్చిన హామీని ఆచరణలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ ప్రతినిధుల డిమాండ్‌పై వైవి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరుగుతుందని భరోసానిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని తెలిపారు. విశాఖలో జర్నలిస్టులకు స్థల కేటాయింపుపై చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్, కార్యదర్శి యర్రా శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు జి.జనార్ధనరావు, సలహాదారు పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పి.రామకృష్ణ, కె.పరశురాం, సహాయ కార్యదర్శులు ఎస్.అనూరాధ, ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రవికుమార్, పి.వి.రావు, సీనియర్ జర్నలిస్టు కీర్తన్, ఎస్‌కెబి.కుమార్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1 అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కం 1 అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసు వారి కోర్టులో

O.S. No. 80/2023

Between:
Sade Madhu ...*Plaintiff*

AND

1. Poliminti Srinivas
2. Poliminti Surya Kumari ...*Defendants*

Defendants

1. Poliminti Srinivas, S/o. Pothuraju, Hindu, Male, age 46 yrs, O/o. CHD Office, Casual Labour (Employee Code: 400026), 4th Floor, T.M. Office (Traffic), Dr. B.R.Ambedkar Bhavan, Port Area, Visakhapatnam - 530035, Visakhapatnam Dist (A.P), Mobile No. 9652532774, 9704653636, Visakhapatnam JCJC.

2. Poliminti Surya Kumari, W/o. Srinivas, Hindu, Female, age 42 yrs, Housewife, C/o. Poliminti Srinivas, O/o. CHD Office, Casual Labour (Employee Code: 400026), 4th Floor, T.M. Office (Traffic), Dr. B.R.Ambedkar Bhavan, Port Area, Visakhapatnam - 530035, Visakhapatnam Dist (A.P), Visakhapatnam JCJC.

దావా సమను

పై నంబరు దావాలో వాదికి ప్రతివాదుల వల్ల రావలసిన ప్రోనోటు బాకీ తాలూకు అసలీ ఫాయిదాలు రాబట్టుకొనుటకు గాను పై నంబరు దావా చేసియున్నారు. సదరు దావాలో కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు దావా సమనులు పంపినప్పటికీ బుద్ధిపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. అందువల్ల కోర్టు వారు పబ్లికేషను ఆర్డరు వేస్తూ **ది. 23-10-2023 తేదీకి వాయిదా వేసియున్నారు.** కావున పై నంబరు దావాలో ప్రతివాదులు అయిన **మీరు వాయిదా రోజున ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానం చేయబడునని మీకు యిందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

ఉంగరాల శివకుమార్
వాది తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం
తేది:22-09-23 సెల్:9246665718 / 19

నిర్ణీత కాలవ్యవధిలో 'స్పందన' సమస్యల పరిష్కారం

స్పందనలో కలెక్టర్ మల్లికార్జునకు సమస్య విన్నవిస్తున్న కెవిపిఎస్ నేతలు

'జగనన్నకు చెబుదాం'లో జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -పిఎం పాలెం: జగనన్నకు చెబుదాం (స్పందన) ద్వారా స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధి లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. శుక్రవారం పిఎం పాలెం అవంతి ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి జగనన్నకు చెబుదాంలో పాల్గొని, 60అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో యధావిధిగా స్పందన ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి వచ్చేనెల 13వరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం నిర్వహించి, జిల్లాస్థాయి అధికారులంతా హాజరై అక్కడ సమస్యలను సమీకరించి పరిష్కరిస్తారన్నారు. జగనన్నకు చెబుదాంలో అందుకున్న విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను జెకెసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలన్నారు. విభాగాధిపతులు ఎదరూ స్పందనపై పూర్తి దృష్టి పెట్టాలని ఆదేశించారు.

పిఎంపాలెం స్పందనలో పిఎం పాలెంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని స్థానిక వైసిపి నేత పొతిన ప్రసాద్ కోరారు. పి ఎం పాలెం ప్రాథమిక పాఠశాలకు స్థలం కేటాయించాలని మరో వైసిపి గాదె రాశి రెడ్డి కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, జివిఎంసి అదనపు కమిషనర్ వర్మ, జెడిసి కె కనకమహలక్ష్మి, రూరల్ తహశీల్దార్ ఎస్ రమణయ్య, ట్రాన్స్‌కో ఇఇ పోలాకి శ్రీనివాసరావు, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహన్, పిఎం పాలెం సిఐ రామకృష్ణ పాల్గొన్నారు.

నిర్వాసితుల ఇళ్లు ఎప్పుడిస్తారు : కెవిపిఎస్

కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో ల్యాండ్‌పూలింగ్ కింద రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారంగానీ, ఒప్పందం మేరకు ఇళ్లుగానీ నాలుగేళ్లుగా ఇవ్వకుండా భూనిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సియాద్రి పైడితల్లి అన్నారు. శుక్రవారం జగనన్నకు చెబుదాంలో బాధిత నిర్వాసితులతో వెళ్లి కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టరేట్‌తోపాటు హౌసింగ్, రూరల్ తహశీల్దార్లకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. భూమిలిచ్చిన రైతులను ఇలా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మూడేళ్ల క్రితం రూరల్ తహశీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు వచ్చి వివరాలన్నీ సేకరించి తీసుకెళ్లారని, తర్వాత పత్తా లేకుండా పోయారని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, నిర్వాసిత రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారికి ఎమ్మెల్యే కోటాలో వంద ఇళ్లను కేటాయించామన్నారు. పంపిణీకి అవసరమైన ప్రక్రియ పూర్తిచేయా కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు డి అప్పలరాజు,సిఐటియు నేత పి రాజుకుమార్, మధురవాడ దళిత సంఘాల నేత సియాద్రి కనకరాజు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- ఆనందపురం: గ్రామాల్లో పరిశుభ్రత, స్వచ్ఛభారత్‌పై అవగాహనకు గొట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వైసిపి యూత్ ప్రెసిడెంట్ ఇల్లపు వెంకటజగన్ ఆధ్వర్యంలో విద్యార్థులతోపాటు యువత, స్థానికులుఈ ర్యాలీలో పాల్గొన్నారు. గాంధీజీ 150 జయంతి సందర్భంగా 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా ప్రధాని మోడీపిలుపు మేరకు కోకోకోలా ఫౌండేషన్, అక్షయ పాత్ర సంయుక్తంగా అన్ని పాఠశాలల్లో స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పిస్తున్నా యన్నారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సరేష్‌బాబు, హెచ్‌ఎంసన్యాసిరావు, వార్డుసభ్యుడు నాగరాజు పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు దూరం

ప్రజాశక్తి-ఆనందపురం : రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం అన్నారు. శుక్రవారం బోయపాలెం జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోలో డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టరాదని, విధిగా యూనిఫాం ధరించి, వాహన పత్రాలన్నీ కలిగి ఉండా లని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించు కోరాదని అతివేగం ప్రమాదకరమని సూచించారు.

తగరపువలస : స్థానిక శారద పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై.భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ చిరంజీవి శుక్రవారం అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎలా నడుచుకోవాలో వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లు బైక్‌లు నడపడం నేరమన్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి అనుపమ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ ఎస్ఎ చంద్రమౌళి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి రిలేదీక్షలు శుక్రవారం కొనసాగాయి. జనసేన పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు. అనకాపల్లిలో శారదానదిలో జలదీక్షలు చేయగా, పలుచోట్ల రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గాజువాకలో న్యాయవాదులు, కార్మిక సంఘాల నేతలు టిడిపి దీక్షకు సంఘీభావం తెలిపాయి.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

మాధవధారలో టిడిపి నేత కీర్తి ఇంటి వద్ద నేతల నిరసన దీక్ష

మాధవధార : చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ 51వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో టిడిపి నేత సనపల కీర్తి ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద నిరసన చేపట్టారు. ఉత్తర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి విజయ్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి వైసిపి ప్రభుత్వం కక్షసాధిస్తోందన్నారు. తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు సీతన్న గార్డెన్స్‌లో కనకమహలక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, టిడిపి నాయకులు జాన్, లలిత కుమారి, మూల అప్పారావు, ఈతలపాక సుజాత, పేడాడ మధుసూదన్ రావు, పాల్గొన్నారు.

భీమునిపట్నం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్ర వారం 13వ రోజుకు చేరాయి పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పాసి నరసింగరావు, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, తెలుగు యువత ఉపాధ్యక్షులు పాసి త్రినాధ్‌కుమార్ పాల్గొన్నారు

ఉక్కునగరం: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా జివిఎంసి 77, 78, వార్డుల టిడిపి అనుబంధ సంఘాలు, స్టీల్ టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి విళ్ల రామ్మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన దీక్షల్లో టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి మూర్తి యాదవ్, టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, అరుగుల మకుమార్, పల్లా పెంటారావు, జోషి, చింతయ్య, డొక్కా నాగభూషణం, పంచదార్ల ఉగ్రం, పులి వెంకటరమణ రెడ్డి, కసిపల్లి శ్రీనివాసరావు, గంతకోరు అప్పారావు, మొల్లి పెంటి రాజు, కర్రి దశేంద్ర, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ సాకేల రతన్‌కాంత్, తలారి వెంకటరమణ, సింగిడి సింహాచలం, తెలుగుమహిళలు అరుగుల జాన్సీ, ఎన్. జయశ్రీ, ఎన్. కవితశ్రీ, పి. జాహ్నవి పాల్గొన్నారు.

గాజువాక: చంద్రబాబు అక్రమ అరెస్టును విశాఖ పార్లమెంట్ టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు కెవి.స్వామి ఆధ్వర్యంలో న్యాయవాదులు ఖండించారు. పాత గాజువాక దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు సీనియర్ న్యాయవాదులు వెన్నెల ఈశ్వరరావు, రెయ్యి విశ్వనాధం, జనసేన లీగల్ సెల్ ప్రతినిధి కరణం కళావతి, బి అప్పలరెడ్డి కె.గోవిందరాజు, టి శ్రీనివాసరావు, ఆర్ సుబుధి, జి అప్పారావు, వి రాజ్‌కుమార్, కె రాజేష్, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గోమాడ వాసు, చట్టి గోపి, శంకరరావు పాల్గొన్నారు

పెందుర్తి : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ చినముసిడివాడ కూడలిలో టిడిపి జనసేన నేతలు రిలేదీక్షలు చేపట్టారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజాసేవ కోసం తపించే చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. టిడిపి, జనసేన కలయికతో వైసిపి అక్రమాలను ఎండగడతామన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు శానాపతి వసంత శంకరరావు, పీలా శ్రీనివాసరావు, ట నేతలు ఆవగడ్డ అప్పలనాయుడు, దాట్ల మధు, సోమశేఖర్ నాయుడు, లక్ష్మి పాల్గొన్నారు

శారదా నదిలో జలదీక్షలో పాల్గొన్న టిడిపి నేతలు

అనకాపల్లి :తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు సారధ్యంలో శుక్రవారం శారదా నదిలో జల దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళి, మళ్ల గణేష్, అండిబోయిన శేషు, విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక మెయిన్ రోడ్‌లో టిడిపి నేతలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. దీక్ష శిబిరాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు సందర్శించారు. మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు టెక్కలి పరశురాం, టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్, మళ్ల వరాహ నరసింహ రావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆర్‌కె బీచ్‌లో శుక్రవారం టిడిపి కార్యకర్తలు వినూత్న నిరసన చేపట్టారు. రాష్ట్రంలో రాజ్యాంగ విలువలకు పాతర వేశారని నినదిస్తూ పీక లోతు ఇసుకలో నిలిచి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, తమ్మినేని మోహన్, వరకుమార్, కుమార్ స్వామి పాల్గొన్నారు.

50వ వార్డులో గడపగడపకూ...

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 50వవార్డు సింగరాయమెట్ట, మురళీనగర్ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజాసమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు వైసిపి నేతలు భాగవతి విజయకుమార్, పప్పల సునీత, పైడి కృష్ణారావు, పొన్నాడ అప్పారావు, కంచరాన రాజేశ్వరరావు, ఎవిఎన్.రాజు, సచివాలయ కన్వీనర్ చిటికెల శ్రీను, సబ్బవరం శ్రీను, చిరంజీవి, రామి నాయుడు, చిన్నారావు, దుంపల సంతోష్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక శారద పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై.భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ చిరంజీవి శుక్ర వారం అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎలా నడుచుకోవాలో వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లు బైక్‌లు నడపడం నేరమన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించ వచ్చన్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి అనుపమ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ ఎస్ఎ చంద్రమౌళి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఇంటి సమస్యపై వినతి

ప్రజాశక్తి -తగరపువలస : ఏళ్ల తరబడి నివాసముంటున్నా, తమ ఇళ్లకు ఇంటి పన్ను వసూలు చేయడం లేదని, ఇంటి పన్ను విధించాలని భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీకి చెందిన పలువురు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రఘునాధబాబుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో సిద్దార్థ వర్మ, రామయ్య మ్మ, రమణమ్మ, సూర్యకాంతం తదితరులు పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వ్యాధుల నిర్మూలనకు సహకారం అవసరం

ప్రజాశక్తి -గాజువాక: సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అందరి సహకారం అవసరమని జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు.సింహాచలం అన్నారు. శుక్రవారం 74వ వార్డు అంబేద్కర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి కలిసి డ్రైడేఫ్రైడే నిర్వహించారు.

ఈ సందర్భంగా డెంగీ,మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల కారకాలైన దోమల నిర్మూలన అందరి బాధ్యత కావాలన్నారు.కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గ్రేటర్ విశాఖకు మెరుగైన ర్యాంకు సాధనకు ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఒహెచ్ఒ ఎస్.కిరణ్‌కుమార్, ప్రత్యేకాధికారి వెంకటరావు, సిఇ శంకరరావు, శానిటరీ సూపర్‌వైజర్ బివి.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.నర్సింగరావు, స్థానిక నేతలు కరజాడ కృష్ణ, మారాడ అప్పలనాయుడు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

త్వరితగతిన బిఆర్‌టిఎస్ రోడ్డు పనులు

ప్రజాశక్తి- సింహాచలం: తొలి పావంచా నుంచి అడవివరం వరకు నిర్వాసితులందరికీ పూర్తి నష్టపరిహారంతోపాటు టిడిఆర్‌లు త్వరలో చెల్లించి, బిఆర్‌టిఎస్ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామని పిటిఐ తేజేశ్వరరావు అన్నారు. శుక్రవారం గోశాల నుంచి అడవివరం వరకు బిఆర్‌టిఎస్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత ఎలైన్‌మెంట్ ప్రకారమే పనులు చేపట్టాలని బాధితులు కోరగా, పరిశీలించి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం, టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్ తదితరులు టిపిఒను కలిసి, బాధితులకు న్యాయం జరిగేలా రోడ్డు పనులు చేపట్టి పూర్తిచేయాలని కోరారు.

విద్యార్థులకు నేత్ర వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : పెద వాల్తేరు, విశాఖ నేత్ర వైద్యశాల, చిట్టివలస సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ సహకారంతో భీమిలి మండలం తాళ్లవలస జెడ్‌పి హైస్కూల్, ఎంపిపి స్కూల్ విద్యార్థులు 342మందికి శుక్ర వారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరూరల్ బోని జగ్గమ్మ , సత్యసాయి సేవాసంస్థల జోనల్ కోఆర్డినేటర్ ఎంవి సత్యసాయి కుమార్, నేత్ర వైద్యులు సిహెచ్ వంశీకృష్ణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు

అప్పయ్యమ్మకు ఘననివాళి

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న గురుమూర్తిరెడ్డి, దేవనరెడ్డి

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ట్రేడ్ యూనియన్ నాయకులు అండిబోయిన అప్పారావు తల్లి అప్పయ్యమ్మ వర్ధంతి సందర్భంగా వుడా కాలనీలో శుక్రవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. హైకోర్టు న్యాయవాది, ఎపి స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని పేదలకు చీరలను పంపిణీ చేశారు. అండిబోయిన అప్పయమ్మ పేరుతో 16ఏళ్లుగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి ప్రెసిడెంట్ కెఎస్ఎన్, వెంపాడ అప్పారావు, వనము నాగేశ్వరరావు, చప్పిడి నాగరాజు, గొలుసు సత్యం, మల్లెల సూర్యనారాయణ, ముసలి శ్రీనివాసు, ఉండవల్లి శ్రీనివాసు, వి.పైడిరాజు, తోకాడ అప్పారావు, గెద్దాడ అప్పల రాజు, బొంతు కనకరాజు, చుక్క ఈశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ బెనిఫిట్స్ చెల్లించాలని వినతి

ఆర్‌సిఎల్ మహంతికి వినతిపత్రం అందజేస్తున్న పైడిరాజు

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగంలో పనిచేస్తున్న నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ బెనిఫిట్స్ పెండింగ్ బకాయిలనుచెల్లించాలని టిఎన్‌టియుసి నేత బొడ్డు పైడిరాజు కోరారు. ఈ మేరకు రీజనల్ లేబర్ కమిషనర్ జగన్నాథం మహంతికి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ యాజమాన్యాలు నాలుగేళ్లుగా చెల్లింపులు చేయడం లేదన్నారు. శ్రామిక సంఘం ప్రతినిధులు పంచదార్ల పెంటారావు, కె రాజు, హెచ్.సతీష్ పాల్గొన్నారు.

24న జిల్లా కోర్టు భవనం ప్రారంభం

జిల్లా కోర్టు నూతన భవన సముదాయం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా కోర్టు నూతన భవనాలను ఈ నెల 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017లో అప్పటి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా, నిర్మాణం పూర్తయి, తుది మెరుగులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధమైందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ యు.దుర్గా ప్రసాద్, జస్టిస్ చీమలపాటి రవి హాజరుకానున్నట్లు తెలిపారు.

నూతన భవనంలోని ఆరు అదనపు జిల్లాకోర్టులతో పాటు రెండు కుటుంబ న్యాయస్థానాలు, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులను షిఫ్ట్ చేయనున్నారు. కార్యక్రమాన్ని జయప్రదంచేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు కోరారు

కృష్ణమూర్తి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : సిపిఎం సీనియర్ నేత వి.కృష్ణమూర్తి కుటుంబానికి సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీల తరపున రూ.2.15 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం ఆరిలోవలోని కృష్ణమూర్తి ఇంటికి వెళ్లిన సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.నరేంద్రకుమార్, ఎస్.రంగమ్మ, సూర్యమణి, శంకరరావు, సత్యనారాయణ తదితరులు, కృష్ణమూరి భార్య అన్నపూర్ణ, కుమారుడు మోహన్, కుమార్తె వాణిలను పరామర్శించారు. ఆర్థికసాయం చెక్కును అందజేసారు.

ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పూర్తికాలం పార్టీలో పనిచేసిన కృష్ణమూర్తి కుటుంబాన్ని అన్ని విధాలా పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయ కార్యదర్శిగా, అకౌంటెంట్‌గా, సుదీర్ఘ కాలం పనిచేసి, నిబద్ధత, నిజాయితీకి మారుపేరైన కృష్ణమూర్తి సేవలను స్మరించారు. ఆరిలోవలో పార్టీ,

ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాసంఘాల బలోపేతానికి, పేదలకు ఇళ్ళు, ఇళ్ల పట్టాల కోసం కృష్ణమూర్తి ఎనలేని కృషి చేసారన్నారు. ఆయన బాటలోనే భార్య అన్నపూర్ణ, పిల్లలు పార్టీ, ప్రజాసంఘాల్లో పనిచేస్తున్నారన్నారు.

వేతన బకాయి చెల్లించాలని వినతి

జెడ్‌సికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు తప్పిపోయిన మిస్సయిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీ కార్యదర్శి, జోన్ బాధ్యులు గొలగాని అప్పారావు, గాజువాక సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎ.లోకేశ్వరరావు, ఎం రాంబాబు కోరారు. శుక్రవారం జోనల్ కమిషనర్ సింహాచలంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జివిఎంసి పారిశుధ్యం, నీటి సరఫరా, ఎంఎస్ఎఫ్ డ్రైవర్లు, ఇతర అన్ని విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికుల్లో ఒకరిద్దరికి ప్రతినెలా వేతనాలు మిస్సవుతున్నాయన్నారు. వీటి చెల్లింపునకు ఆప్కాస్‌కు సప్లిమెంటరీ బిల్లు పెట్టినా, 2021 నుంచి నేటి వరకు గత మూడేళ్లుగా చెల్లించని పరిస్థితి ఉందన్నారు. దీనిపై జివిఎంసి కమిషనర్‌కు విన్నవించినా స్పందన లేదని, పనిచేసిన కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే వారి కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. దీనిపై డ్యూటీ సర్టిఫికెట్స్ ఇవ్వాలని జివిఎంసి ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చినా, గాజువాక జోనల్ కార్యాలయం నుంచి అందించడంలో ఆలస్యమైందన్నారు. తక్షణమే వేతన బకాయిచెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. జెడ్‌సికి వినతిపత్రం ఇచ్చిన వారిలో . నక్క నాగరాజు, గణేష్, మీనాక్షి, పలువురు కార్మికులు ఉన్నారు.

'గీతం'తో అరబిందో ఫార్మా ఎంఒయు

ఎమ్‌డిపి శిక్షణ కార్యక్రమాలపై దృష్టి

ప్రజాశక్తి- మధురవాడ : ప్రముఖ ఔషధ పరిశ్రమ అరబిందో ఫార్మా లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తులకు ప్రత్యేక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను (ఎమ్‌డిపి) నిర్వహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్‌తరన్‌దాస్ సమక్షంలో అరవిందో ఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు (మానవ వనరుల విభాగం) యుఎన్‌బి.రాజు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ ఔషధ రంగంలో కాలానుగుణ మార్పులు, నూతన అంశాలు, నిబంధనలపై నిరంతర శిక్షణ ద్వారా అవగాహన పెరుగుతుందన్నారు. పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు గీతం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అరవిందోఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు యు.ఎన్.బి.రాజు మాట్లాడుతూ గత ఏడాది

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

తమ సంస్థలో పనిచేస్తున్న సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిపుణులు ఇచ్చిన శిక్షణ విజయవంతం కావడంతో సంస్థలోని ఇతర ఉద్యోగులకు గీతం ద్వారా ఆరో అస్త్ర పేరిట ఎమ్‌డిపి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గీతంతో తమ అనుబంధం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గీతం కన్సల్టెన్సీ, కొలాబరేషన్స్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్‌శాస్త్రి, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ జి.శ్రీలలిత, అరవిందో ఫార్మా

పిఎసిఎస్ కాంప్లెక్స్ కూల్చి పెట్రోల్ బంక్ ఏర్పాటు దుర్మార్గం

ప్రజాశక్తి -మధురవాడ : పూర్వికులు స్థాపించిన మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన సముదాయాన్ని కూల్చి, అక్కడ పెట్రోల్ బంక్ నిర్మిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, సిపిఐ నేత మరుపిళ్ల పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధురవాడ సిపిఐ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ గురువారం సహకారశాఖ అధికారులు వచ్చి పిఎసిఎస్ కొలతలు తీసి వెళ్లారని, ఇది పూర్తిగా సహకార స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

2007లో పిఎసిఎస్ భవనాన్ని అభివృద్ధి చేశామని, అప్పట్లో వైఎస్ఆర్ హయాంలో వాణిజ్య సముదాయం నిర్మాణానికి కృషి చేశారన్నారు.దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టిశ్రీనివాసరావు దృష్టికి తీసుకెళతామన్నారు. పిఎసిఎస్‌ను క్రెడిట్ సొసైటీగా మార్చి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సొసైటీని కూల్చి,

మాట్లాడుతున్న పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పైడిరాజు

పెట్రోల్‌బంక్ ఏర్పాటును ఒప్పుకోబోమని, సంఘసభ్యులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు సిపిఐ నాయకులు కొల్లి మేఘారావు, పెంటపల్లి కాంతమ్మ, వి సత్యనారాయణ, ఎండి బేగం, జి వేళంగినిరావు, ఎంఎస్ పాత్రుడు, కె కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి వినతి

మంత్రి గోవర్ధనరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు అభివృద్ధికి అదనంగా రూ 30లక్షలు నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ కోరారు. శుక్రవారం అమరావతిలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి కాకాని గోవర్ధనరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తగరపువలస రైతు బజారుకు అదనంగా రూ 10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఆనందపురం రైతు బజారు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ నిర్వహణ, చెట్లు కొమ్మలు తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, బిఎన్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతువాక కొండ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పలుచోట్ల అన్నసమారాధనలు

ఆరిలోవలో అన్నసమారాధనలో పాల్గొన్న మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 9వ వార్డు కొండవాలు ప్రాంతమైన సింహగిరి కాలనీలో శుక్రవారం నిర్వహించిన అన్నసమారాధనను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించి, పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక సంఘం నాయకులు నీలాపు రామ్మోహన్‌రెడ్డి, దూడ అప్పన్న, అప్పారావు పాల్గొన్నారు.

ఆనందపురం :వెల్లంకిలో శుభలక్ష్మీ పేరంటాలు గుడి వద్ద వినాయక చవితి సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణ రావు, ఉప సర్పంచ్ కంచరపు శ్రీనివాసరావు, శ్రీ శుభ బలరాం ఛారిటబుల్ సేవా ట్రస్టు వ్యవస్థాపకులు పి.జానకేశ్వరరావు, పివివి. ప్రసాదరావు పట్నాయక్ పాల్గొన్నారు.

సీతమ్మధార: 54వ వార్డు కంచరపాలెం సన్‌రైస్ క్లబ్ వద్ద భారత్‌పుత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో, అలాగే 45వ వార్డు తాటిచెట్లపాలెం, తారకరామ నగర్ వద్ద శ్రీగణాంజనేయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు అధ్యక్షులు పైడి రమణ, కెపి.రత్నాకర్, హరిపట్నాయక్, తిరుపతి రావు, రాంబాబు, అప్పలస్వామి, నేపాల్ శ్రీను, సన్నీ, ఆదిలక్ష్మి, దుర్గ, నాయుడు, గణపతి, రాజా, దిలీప్, నవీన్ పాల్గొన్నారు.

మధురవాడ: జివిఎంసి ఏడో వార్డు ఆదిత్యనగర్‌లో వినాయక ఉత్సవాల సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నాగోతి సూర్య ప్రకాష్ అండ్ సన్స్, పోతిన సాంబశివరావు అండ్ సన్స్, ఎల్ఎస్.నాయుడు, పోతిన ఉమామహేశ్వరరావు, పితాని వెంకటేశ్వరావు, కల్మటి తాతారావు, బయిపిల్లి బాబూరావు అండ్ సన్స్, అను జనరల్ స్టోర్స్, ఎస్ఎంఎస్ ఈవెంట్స్ దుక్క అప్పారావు అండ్ సన్స్, వానపల్లి ఈశ్వరరావు, వాసవి ట్రేడర్స్ వాసు, కెవిఆర్ కేటరింగ్ గురునాథ్ సహకరించారు.

డి.పట్టాదారులకు పరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని వెదురువాడ రెవెన్యూ సర్వేనెంబర్ 1లో జగనన్న కాలనీ నిమిత్తం ప్రభుత్వం డి.పట్టాదారుల నుండి తీసుకున్న భూములకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో బాధితులు ధర్నా చేశారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు మాట్లాడుతూ వెదురువాడ సర్వే నెంబరు 1లో ఐదు గ్రామాలకు చెందిన 142 మంది పేదలకు, మాజీ సైనికులకు రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అప్పటి ప్రభుత్వం డీ పట్టాదారు పాస్ పుస్తకాలు 2005లో పంపిణీ చేసిందని తెలిపారు. ఆ భూముల్లో జీడి మామిడి తోటలు పెంచి వాటి ఫలసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం జగనన్న కాలనీకి పది ఎకరాల భూమి తీసుకుందన్నారు. డి-పట్టాదారు లబ్ధిదారుల నుంచి సేకరించిన భూమికి 2013 చట్టం ప్రకారం ఎకరాకి రూ.18 లక్షలు వరకు పరిహారం చెల్లించాల్సి ఉండగా, నేటికీ ఎ´ రి ఎ´ ॰ ం´ ం చెల్లించలేదన్నారు. తక్షణమే పరిహారంతో పాటు వడ్డీ కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములకు సర్వే చేసి సరిహద్దులు నిర్ధారించి పట్టాదారులకు అప్పగించాలని, రైతు భరోసా చెల్లించాలని కోరారు. చనిపోయిన పట్టాదారుల స్థానంలో వారి వారసులకు పట్టాలు బదిలీ చేయాలని, ప్రభుత్వ ఆర్డినెన్స్ ప్రకారం భూమి కొనుగోలుకు అమ్మకాలకు హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెదురువాడ గ్రామ సర్పంచ్ కె శ్రీనివాస్, పుర్రె శ్రీనివాసరావు, కారుకుండి శ్రీను, కిల్లాడి బాబూజీ, కే.గోపి, కె.వెంకట అప్పారావు, పి.శ్రీను, ఏ.అప్పలనాయుడు, వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మోసయ్యపేట, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన పట్టాదారులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న డి.పట్టాదారులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యలమంచిలి

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన 'ఉక్కు రక్షణ' యాత్రను జయప్రదం చేయాలని శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, శంకరరావు మాట్లాడుతూ 'పాలకుల మెడలు వంచి పోరాడి సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పరులకు ధరాదత్తం చేయడానికి పూనుకొన్న కేంద్ర ప్రభుత్వం తీరును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఉక్కు రక్షణ యాత్ర ఈ నెల 27వ తేదీ బుధవారం 10 గంటలకు యలమంచిలి వస్తుందని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక తోపుడు బళ్ల కార్మికులు, యువకులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్ల ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్ఐసి ఏజెంట్లు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అనకాపల్లి బ్రాంచ్ అధ్యక్షులు పెంటకోట సైదు నాయుడు మాట్లాడుతూ బీమారంగంలోని అన్ని లావాదేవీలపై జీఎస్టీని తొలగించాలని, డైరక్ట్ మార్కెటింగ్, ఇన్సూరెన్స్ పాలసీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు జి శంకరావు, సీనియర్ ఏజెంట్లు నడిశెట్టి అప్పారావు, పీలా శ్రీనివాసరావు, ట్రెజరర్ మాణిక్యం రావు మాట్లాడుతూ జీవిత బీమా ఏజెంట్స్ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, గ్రూప్ ఇన్సూరెన్స్, దాని వయో పరిమితిని పెంచి, ప్రీమియం తగ్గించాలని, ఏజెంట్స్ మెడి క్లెయిమ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవిత బీమా ఏజెంట్లు ఐతా రాము, కొణతాల నూకా అప్పారావు, రొంగలి వెంకట్రావు, సాసుబిల్లి సత్యారావు, బొండా నూకరాజు, కొణతాల వెంకట అప్పారావు, నడిశెట్టి బాబూరావు, కే యల్ ఎన్ కుమార్, చింత సురేష్, జయభేరి నాయుడు, కొయిలాడ శివాజీ, పోతల రామారావు, వనం అచ్చిం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో పలు అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం అజెండాలో 20 అంశాలు, ఒక టేబుల్ అజెండాతో మొత్తం 21 అంశాలు పొందుపరచగా అన్నీ ఆమోదం పొందినట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.477.93 లక్షల పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి సుమారు రూ.86.58 లక్షల పనులకు ఆమోదం లభించిందన్నారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు, పొడిగింపులతోపాటు పలు అంశాలకు ఆమోదముద్ర పడిందన్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి (రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, ఎస్‌వి.రమణ, శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్, కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాదబాబు, శేఖర్, ఎఎంఒహెచ్ సత్యనారాయణ, బయాలజిస్ట్ సాంబమూర్తి పాల్గొన్నారు.

నారపాకలో నగదు, బంగారం చోరీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఆవరాజం గ్రామపంచాయతీ శివారు నారపాక గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మొల్లి నాగమణి ఇంటిలో దొంగతనం జరిగింది. వంట పగలు ఇంటి తలుపులు పగలకొట్టి లోపలకు ప్రవేశించి బీరువా తెరిచి అందులో ఉన్న వస్తువులను నగదును దొంగిలించారు. ఈ దొంగతనంలో నాగమణికి చెందిన రూ.50వేలు నగదు, మూడు తులాల బంగారం అపహరించారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ కృషి

రాష్ట్ర జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, టీచర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 49 సంవత్సరాలు పూర్తి చేసుకొని, 50వ వసంతంలోనికి అడుగు పెడుతున్న సందర్భంగా శుక్రవారం స్వర్ణోత్సవ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుటిఎఫ్ గత 49 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు అలుపెరుగని రీతిలో కృషి చేస్తుందని తెలిపారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ యుటిఎఫ్ సామాజిక స్పృహ కలిగిన సంఘంగా ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించే ఉద్యమం చేపట్టిందన్నారు. స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా రాష్ట్ర స్థాయి జాతా శనివారం అనకాపల్లి జిల్లాలో ప్రవేశిస్తుందని, దానిని ఉపాధ్యాయులందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఉమా, దేముల్లు నాయుడు, బాబూరావు, కరుణ జ్యోతి, స్వామి పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌తో సురక్షిత తాగునీరు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే జల జీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని నేషనల్ జల జీవన్ కమిటీ సభ్యులు ఈశ్వర్ చంద్ జైన్, సుశీల్ కుమార్ చౌబె అన్నారు. మండలంలోని డి అగ్రహారం, ఆర్‌వై అగ్రహారం, గొట్లాం, వి.సంతపాలెం, పిండ్రంగి గ్రామాలలో శుక్రవారం వారు పర్యటించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న జల జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. తాగునీరు అందుతున్న తీరును ఆయా గ్రామాలలో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు మంచినీటిలో క్లోరినేషన్ వేసి ప్రతి 15 రోజులకు ట్యాంకును శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఈఈ అల్లు సూర్యనారాయణ, ఎఇ శ్వేత, సైట్ ఇంజనీర్ లక్ష్మణరావు ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

24న సినీ పాటల పోటీలు

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రముఖ చలనచిత్ర నేపథ్య గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి సందర్భంగా ఈ నెల 24న స్కూల్, కాలేజ్ విద్యార్థిని విద్యార్థులకు కళ్యాణి అకాడమి ఆఫ్ ఆర్ట్స్, అబ్దుల్ కలామ్ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అనకాపల్లి జార్జ్ క్లబ్ ఎదురుగా గల కళ్యాణి అకాడమి ఆఫ్ ఆర్ట్స్ లో తెలుగు సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమి చైర్మన్ సంగీత దర్శకులు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్, అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆళ్ళ ప్రవీణ్ కుమార్, గంగలకుర్తి భాగ్యలక్ష్మి తెలియజేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ ఈ పోటీలు జూనియర్, సీనియర్ విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. 8 నుండి 12 వరకు జూనియర్స్ గాను, 13 నుండి అపైన సీనియర్స్ గాను పరిగణిస్తామని, రెండు విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులతో పాటు రెండు ప్రత్యేక బహుమతులు వుంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు అకాడమి లో గాని లేదా 9959577789 ,8121521566 నెంబర్‌కి కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

డైట్‌లో ఘనంగా ఫారడే జయంతి

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో శుక్రవారం ఇ ఇ ఇ డిపార్ట్మెంట్ డే, ఫారడే మెమోరియల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.శ్రీను నాయక్ విచ్చేసి విద్యార్థుల పరిశోధనలను నిదర్శనంగా 'ఇన్నోవేటివ్ ఐడియాస్ -23 23' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్ వైకుంఠరావు, ఇ ఇ ఇ విభాగాధిపతి డాక్టర్ ఏ ఎస్ ఎల్ కె గోపాలమ్మ ,ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. సాంకేతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పిహెచ్‌సిల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపిపి గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలోని తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కార్యవర్గ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది, సర్పంచ్, ఎంపీటీసీలతో చర్చించారు. హాస్పటల్ మొత్తం చెదల నివారణ చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు మెస్ వర్క్ చేపట్టాలని, బయో మెడికల్ వేస్ట్ కవర్స్, గ్రీన్ క్లాత్ చేయాలని, కంటెజెంట్ వర్కర్స్ జీతభత్యాలు, ల్యాబ్ లో కబోర్డ్ ఏర్పాటు, గ్యాస్ సిలిండర్, ఇన్వర్టర్ కొనుగోలు చేయుటకు, ఎమర్జెన్సీ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ ఎమర్జెన్సీ లైట్ కొనుగోలు వంటి అంశాలపై కార్యవర్గ సభ్యులు చైర్మన్ దృష్టి తీసుకువచ్చారు. వాటిని త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తామని ఎంపీపీ సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు మెంబర్లు డాక్టర్ జి.పావని, ఎంపీడీవో కె.వి నరసింహారావు, ఎమ్మార్వో పివిఎల్ఎం గంగాధర్, తగరంపూడి సర్పంచ్ యదిగిరి అప్పారావు, దిబ్బపాలెం సర్పంచ్ పీలా ఉషాఅప్పారావు, వైస్ ఎంపీపీ ఆయితా ఆనంద రాము, మొల్లి నాయుడు ,పొలమరశెట్టి నర్సింగరావు, సుందరయ్యపేట సర్పంచ్ బొదపు తాతారావు, మండల కో ఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు ,హెల్త్ సూపర్వైజర్లు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీకి తరలిరండి

ప్రజాశక్తి - పరవాడ : అక్టోబర్ 5వ తేదిన ఢిల్లీలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఐద్వా నాయకులు కరపత్రాలు ద్వారా పరవాడ మండలంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం మత్తు పదార్థాలను నియంత్రించాలని ఐద్వా పోరుయాత్ర చేపట్టిందని తెలిపారు. నేటికీ మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, అనేక అకృత్యాలు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో మహిళలు ముందడుగు వేసినప్పటికీ సమానత్వం కోల్పోతున్నారన్నారు. చంద్రయాన్-3లో 55 మంది మహిళలు శాస్త్రవేత్తలు ఘనమైన పాత్ర పోషించారన్నారు. బిజెపి ప్రభుత్వం మహిళల అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళల్ని నగ్నంగా ఊరేగించిన వారిని, సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ శ్రీదేవి, రవణమ్మ, ఎం వరలక్ష్మి, పి వరహాలమ్మ, టి ఈశ్వరమ్మ, డి పద్మ , పి చిన్నమ్ములు పాల్గొన్నారు.

ప్రచారంలో కరపత్రాలు చూపుతున్న మహిళలు

దేవరాపల్లిలో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంలోని మోడల్ కాలనీలో 37ఏళ్ల యువతికి డెంగీ సోకినట్లు దేవరాపల్లి పీహెచ్సీ వైద్యాధికారిణి ఎస్.లలిత శుక్రవారం తెలిపారు. దీంతో మండల కేంద్రం వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో దోమలబెడద ఎక్కువగా ఉన్నట్లు ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. త్వరలోనే దోమలమందు స్ప్రేయింగ్ చేస్తామన్నారు. డాక్టర్ లలిత ఇంటింటి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యలోపం వల్ల దోమలు అధికంగా ఉన్నాయని, దోమకాటు వల్ల డెంగు మలేరియా వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని ఆమె తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గుల్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై ఎరువులను శుక్రవారం పంపిణీ చేశారు. పది టన్నుల యూరియాను రైతులకు అందించారు. అమృతపురం, సబ్బవరం, తవ్వవానిపాలెం, గొల్లలపాలెం, అంతకాపల్లి రైతు భరోసా కేంద్రాలకు 12 మెట్రిక్ టన్నులు చొప్పున రైతు భరోసా కేంద్రాలకు యూరియా చేరుతుందని తెలిపారు. వ్యవసాయ సహాయకులు హేమలత పాల్గొన్నారు.

ఆలయానికి గేట్లు ఏర్పాటుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పరవాడ : రావాడ పంచాయతీ శివారు జల్లలపాలెం గ్రామంలో మరిడి మాంబ అమ్మవారి ఆలయానికి గేట్లు ఏర్పాటు నిమిత్తం ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింత కాయల సుజాత ముత్యాలు శుక్రవారం రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్‌కు అలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా, ఆలయం ధర్మకర్త మేడిశెట్టి మాణిక్యం, పితాని అప్పారావు, వియ్యపు సూర్య చంద్ర అప్పారావు, పోలవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై పెను భారం మోపిన జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ హెచ్చరించారు. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే 7 సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచడమే కాకుండా వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. చత్తీస్గడ్ , రాజస్థాన్లో 7,900 రూపాయలకే మీటర్లు కొనుగోలు చేయగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 35 వేలకు పైబడి కొనుగోలు చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, సుబ్బలక్ష్మి, స్థానిక స్థానిక నాయకులు మాధవరావు, భద్రం, నాగరాజు, సత్తిబాబు, భూసి పరమేశ్వరీ, వేమల కన్నబాబు, జి. దేవుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం 16వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంక్, విశాఖపట్నం వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య శ్రీసుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ రక్త దానం వలన కష్టంలో ఉన్న ఒక ప్రాణాన్ని నిలబెట్టవచ్చని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 90 యూనిట్ల రక్తం విద్యార్థులు, సిబ్బంది దానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ గిరి నాయుడు, సమన్వయకర్త డాక్టర్ విశ్వచంద్రనాథ్, లీలా దేవి, ఫిజికల్ డైరెక్టర్ ఓ.ఎం.రాజు సుధాకర్, డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.

విశాఖ నుంచి పాలనపై వైసిపి హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ రాజధానిగా దసరా నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో వైసిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ లో సంపత్ వినాయక ఆలయంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, వెంకటేశ్వర ఆలయ ఇన్చార్జ్ సకల గోవిందు, మళ్ల బుల్లి బాబు, జాజుల రమేష్, డాక్టర్ రామ్మూర్తి, ఆళ్ల నాగేశ్వరరావు, కొందూరు రవీంద్ర, రత్నకుమారి, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దేవాదాయ భూముల స్వాధీనానికి అడ్డుపడొద్దు

ఉపముఖ్యమంత్రి బూడికి సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి మండలం మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 115లో ఆక్రమణకు గురైన 23.15 ఎకరాల దేవుని మాన్యం భూమి స్వాధీనానికి అడ్డుపడొద్దని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడుకు సిపిఎం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఉపముఖ్యమంత్రి బూడికి బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను పత్రికలకు విడుదల చేశారు. ఆ వివరాలు... మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 115లో కోట్లాది రూపాయలు విలువ చేసే 23.15 ఎకరాల దేవుని మాన్యం భూమి దురాక్రమణకు గురైంది. దీనిపై సిపిఎం స్పష్టమైన ఆధారాలతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు రెండేళ్లగా అనేక సార్లు ఫిర్యాదు చేసింది. దీనిపై వారు దర్యాప్తు జరిపి దేవుని భూమిగా గుర్తించి 22ఎ1సిలో చేర్చడానికి అనుమతి కొరకు ప్రయత్నిస్తున్న సమయంలో తమరు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి రిజిస్ట్రేషన్లు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని, 22ఎ1సి చేర్చడానికి వీల్లేదని ఒత్తిడి చేయడం సరికాదు. ఇప్పటి వరకు ఈ భూ ఆక్రమణలో మీకు ఎటువంటి సంబంధం లేదని మేము భావించాం. కాని కొంత కాలం నుండి మీరు దేవాదాయశాఖ అధికారులపై ఒత్తిడి చేయడం మీ స్థాయికి తగదు. దీని వల్ల మీకు, మీ పార్టీకి తీవ్రమైన నష్టం జరుగుతుంది. కావునా మంచి మనస్సుతో ఆలోచించి దేవాదాయశాఖ అధికారులపై ఎటువంటి ఒత్తిళ్లు చేయకుండా వెంటనే 22ఎ1సిలో చేర్చడానికి సహకరించాలని వెంకన్న ఆ లేఖలో కోరారు.

29న మహాధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : దళితుల రక్షణ కోరుతూ ఈనెల 29న విజయవాడలో మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని, దానిని జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్లే చిరంజీవి పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మహా ధర్నా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా కేటాయించిన నిధులు ఖర్చు చేయాలని, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసి ప్రకారం బెయిల్ ఇవ్వకూడదని, ఎస్సీ ఎస్టీలపై మహిళలపై దాడులు అరికట్టాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ అన్ని స్థాయిలో ఏర్పాటు చేయాలని, ప్రతి సంఘానికి అవకాశాలు కల్పించాలని, కోనేరు రంగారావు సిఫార్స్ అమలు చేసి ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నబాబు అర్జున్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

బడి బస్సు పునరుద్ధరణకు హామీ

వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం మండలం అన్నవరంలో బిసి బాలికల వసతి గృహం నుండి కొత్తూరు జంక్షన్ వరకు బడి బస్సు నడపడానికి అనకాపల్లి డిపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో బడి బస్సు రాకపోకలు సాగించేది. కరోనా వచ్చిన తర్వాత బస్సును నిలిపివేశారు. అప్పటినుండి విద్యార్థులు కాలినడకనే స్కూళ్లకు కాలేజీలకు ప్రయాణం సాగిస్తున్నారు. బీసీ హాస్టల్ వసతి గృహంలో 130 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరందరూ రోజు నాలుగు కిలోమీటర్ల రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో ఈ నెల 18వ తేదీన చోడవరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టి సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దిగివచ్చిన అధికారులు బస్సును పునరుద్ధరించడానికి హామీ ఇచ్చారు. విద్యార్థినులందరికీ ఉచిత బస్సు పాస్‌లో చేయించుకున్న వెంటనే బస్సును నడపడం ప్రారంభిస్తామని తెలిపారు. బస్సు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ఆర్టీసీ అధికారులకు సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్ రావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి తరుణ్, నాయకులు, దొర తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల ఉచిత సరఫరాకు గుర్తింపు శిబిరాలు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో ఉన్న వికలాంగులు, వృద్ధులకు ఉచిత ఉపకరణాలు అందజేయుటకు గాను జిల్లాలోని నాలుగు కేంద్రాలలో గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరికరాలు హైదరాబాదుకు చెందిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆలిమ్‌-కో సరఫరా చేస్తుందన్నారు. అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, నర్సీపట్నంలలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. 26న అనకాపల్లి, అచ్యుతాపురం, కసింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాల వారికి ఏఎంఏఎల్ కళాశాల, 27న బుచ్చయ్యపేట, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, కె కోటపాడు, రావికమతం, వి.మాడుగుల మండలాల వారికి చోడవరం గవర్నమెంట్ హైస్కూల్లో, 28న నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్. రాయవరం మండలాల వారికి ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, 29న గొలుగొండ, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, రోలుగుంట మండలాల వారికి నర్సీపట్నం పెద్ద బొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన సదరం వైద్య ధ్రువీకరణ (40శాతం లేదా అంతకన్నా ఎక్కువ),ఆదాయ ధ్రువీకరణ పత్రం (నెలకు15 వేలకు మించకుండా), రేషన్ కార్డ్ లేదా ఓటరు కార్డు (చిరునామా కొరకు), ఆధార్ కార్డ్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు (అంగవైకల్యం కనిపించే విధంగా ఉన్నది) యుడిఐడి కార్డ్ తీసుకురావాలని సూచించారు. అభ్యర్థి గత మూడు సంవత్సరాల్లో ఉపకరణాలు తీసుకుంటే అనర్హులన్నారు. అర్హత ఉన్న వికలాంగులు ఈ శిబిరాల్లో పాల్గొని అవసరమైన ఉపకరణాలను పొందవచ్చని తెలిపారు.

సత్యాగ్రహ దీక్షకు సామూహిక సెలవు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : ఈనెల 25న ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్ పిలుపు మేరకు విజయవాడలో నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు సామూహిక సెలవు మంజూరు చేయాలని స్థానిక ఎంఈఓ ఎస్ లక్ష్మణరావుకి ఎస్ఎస్ఏ ఉద్యోగులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ మహేష్, సింహాద్రప్పుడు, సీఆర్పీ ఎస్.లావణ్య, కె. నాగమణి, ఎన్.కళాభారతి, ఎస్. భూలక్ష్మి, ఎస్.బేబీరాణి పాల్గొన్నారు.

కశింకోట : సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్టు ఉద్యోగుల పర్మనెంట్ చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న కశింకోట మండల కేంద్రంలో చేటనున్న సత్యాగ్రహ దీక్షకు అనుమతి ఇవ్వాలని కశింకోట మండల విద్యాశాఖ అధికారి చిట్టి బాబుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిష్ట సత్యారావు, గణేష్, సూర్య దాస్, శ్రీదేవి, సురేష్, రామలక్ష్మి, సత్తిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రౌండ్ అభివృద్ధికి నిధులు మంజూరుకు వినతి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి మున్సిపల్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర షిప్పింగ్ పోర్టుల అభివృద్ధి శాఖ మంత్రి శర్వానంద్ సోనోవాల్‌కు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి వినతిపత్రం అందజేశారు. తన ఎంపి నిధులను మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేస్తానని తెలిపారు. అన్నిరకాల క్రీడాపోటీలకు అనుగుణంగా గ్రౌండ్ ను అభివద్ధి చేయడానికి ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు.

24న బాల్ బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ 16 బాల బాలికల జిల్లా జట్లు ఎంపిక కార్యక్రమం ఈ నెల 24న ఆదివారం ఉదయం మండలంలోని నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్ల ఎంపికకు హాజరు కావలసినవారు 2008 జనవరి తరువాత జన్మించిన వారై ఉండాలని సూచించారు.

మురికినీటి కాల్వల నిర్వహణపై అసంతృప్తి

ప్రజాశక్తి - యలమంచిలి : తాను మున్సిపాలిటీలో తిరిగిన ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించిందని, పట్టణంలోని అపారిశుధ్యంపై మరింత శ్రద్ధ వహించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆకస్మికంగా మున్సిపాలిటీ కార్యాలయానికొచ్చి కమిషనర్ కొండలరావుతో పలు ప్రాంతాలు సందర్శించారు. ముందుగా శ్మశాన వాటిక దగ్గర్లోని పాత డంపింగ్ యార్డు సందర్శించి అక్కడి పేరుకుపోయిన చెత్తను తొలగించిన విధానాన్ని అభినందించారు. ఆ యార్డులో పొడి చెత్తను కంప్రెస్ చేసి అచ్చులుగా తయారు చేసే వాటిని జిందాల్ కంపెనీకి అందజేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. శేషుకొండ ప్రాంతంలోని డంపింగ్ యార్డును సందర్శించిన అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీ ఆదాయం పెంపొందించుకొనే మార్గాలు చేపట్టాలన్నారు. ఇంటింటి నీటి కొళాయిలు, చెత్త సేకరణ, విలీన గ్రామాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమీక్షా కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, మేనేజరు ప్రభాకరరావు, రెవెన్యూ అధికారి నీలిమ, టిపిఒ శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై సంతృప్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : తగరంపూడి సచివాలయం పరిధిలో ఉన్న ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రం-2 పరిశీలించిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. కాసేపు పిల్లలతో ఏబిసిడిలు రైమ్స్ చెప్పించి వారిని అభినందించారు. అంగన్వాడి సెంటర్ కూడా చాలా చక్కగా ఉందని చెప్పారు. అంగన్వాడీలో కొన్ని సమస్యలు ఎంపీపీ దష్టికి తీసుకు రాగా సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి పనులు త్వరగా ప్రారంభించమని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈఓపిఆర్డి కే ధర్మారావు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ ఆయితా ఆనంద రాము, మొల్లి నాయుడు, పొలమరశెట్టి నర్సింగరావు, సుందరయ్యపేట సర్పంచ్ బాదపు తాతారావు, మండల కో ఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సిద్ధి వినాయక నవరాత్రులు సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు లాను చందు ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుతాపురంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పవన్, విజయ్, రుత్తల శ్రీను, రుత్తల నరేష్, చీపురుపల్లి తాతాజీ, శివాజీ, రాంబాబు, నాయుడు, శ్రీను, కొండబాబు, మాధవరావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కారం

- జగనన్నకు చెబుదాంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ప్రజాశక్తి-గొలుగొండ: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నింటిని వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం శుక్రవారం గొలుగొండ మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా స్థాయి అధికారులు నెలకు రెండు మార్లు చొప్పున మండలాలను సందర్శిస్తే సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో పలు సమస్యలకు పరిష్కారం నిర్దేశించిన సమయంలో జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమస్యలను కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఈ స్పందన కార్యక్రమానికి 146 వినతులు వచ్చాయి. ఈ సమస్యలలో ఎక్కువగా భూతగాదాలు, పట్టాలు, పారిశుధ్యం, ఇళ్ల పట్టాలు, తాగు, సాగునీరు వంటివి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఎంహెచ్ఓ

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

హేమంత్, నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల వాణి, మండల ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనందరావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ సమస్యలపై వినతి

గొలుగొండ: ఏఎల్‌పురంలో నెలకొన్న సమస్యలను గొలుగొండలో శుక్రవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం, ఇంకనూ అర్హులైన జగనన్న లబ్ధిదారులకు స్థల మంజూరుకు, గ్రామంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ స్థల ఆక్రమణకు గురి కాకుండా ఆ స్థలంలో వారపు సంత నిర్వహించుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. గ్రామంలో శ్మశానవాటికకు సిసి రోడ్ నిర్మాణం, సుమారు 175 డ్వాక్రా గ్రూపులకు సమావేశాలు నిర్వహించుటకు, మహిళా సాధికారిత భవన్ నిర్మాణం, సచివాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులపై విన్నవించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఆటల పోటీలు

కోటవురట్లలో ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-యంత్రాంగం:నియోజకవర్గ స్థాయి పాఠశాలల విద్యార్థుల ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు పాఠశాలల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు.

కోటవురట్ల:ప్రభుత్వ పాఠశాలలో రెండవ రోజు నియోజకవర్గ స్థాయి ఆటలు పోటీలు శుక్రవారం ఉత్కంఠ భరితంగా సాగాయి. కోటవురట్ల, నక్కపల్లి రాయవరం, పాయకరావుపేట మండలాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి క్రీడల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల పిడి మట్టగణేష్ క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

చీడికాడ:శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహద పడతాయని తహసీల్దార్ బి.వి.రాణి అన్నారు. మండలం కేంద్రమైన చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూలు గేమ్స్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయి స్కూలు గేమ్స్ పోటీలు చీడికాడలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి, ఇతర ప్రజా ప్రతినిధులను ఎంఇఒలు, పిఇటిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి రైతు విభాగం అధ్యక్షులు యర్రా అప్పారావు, సర్పంచ్ సామలమ్మ, చీడికాడ గ్రామ వైసిపి కన్వీనర్ పరువాడ మహేష్, మండల విద్యాశాఖాధికారులు బొంజుబాబు, బివి రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

యలమంచిలి:నియోజకవర్గ స్థాయి పాఠశాల విద్యార్థుల ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. భాగంగా శుక్రవారం అథ్లెట్స్ పోటీలు స్థానిక క్రీడా మైదానంలో జరిగాయి. రన్నింగ్, త్రోయింగ్ ఈవెంట్స్‌లో అండర్ 14, 17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు ఎంపిక చేశారు. వారు జిల్లా స్థాయి పోటీలకు అర్హులని ప్రకటించారు. కొత్తపేట హైస్కూలు గ్రౌండ్‌లో జరిగిన బాలుర అండర్ 14, 17 కేటగిరి త్రో బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, బాల్ బాట్మింటెన్, యోగ అంశాల్లో జిల్లాలో పాల్గొనే వారి ఎంపిక ప్రక్రియ పూర్తయింది. మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాలకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వై.వి.రమణ, కార్యదర్శి సిహెచ్ వెంకటరావు, పిడిలు షబ్బీర్, సురేష్, మూర్తి, కుమార్, రాజు, అమ్మోరయ్య, ఇందిర, సూర్యప్రభ, శారద పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట బాలికల హైస్కూల్‌లో నియోజకవర్గం స్థాయి ఖోఖో, యోగా అండర్ 14, 17 విభాగాల్లో పోటీలు గురువారం జరిగాయి. వీటిని ఎంపిపి కలగ లక్ష్మి గున్నయ్య నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజని, ప్రధాన ఉపాధ్యాయులు స్వర్ణ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు పెంటకోట సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హత క్రీడా పోటీలు

ఆరిలోవ :తూర్పు నియోజకవర్గ అండర్-14, అండర్-17 బాలికల సెలెక్షన్ ట్రయల్స్ తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఖోఖో, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ అర్హత పోటీలకు 12 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం భవాని మాట్లాడుతూ అర్హత సాధించిన బాలికలను జిల్లాస్థాయి ఆటల పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.ఈ అర్హత పోటీలను పాఠశాల పిడి శ్రీనివాసరావు, ఎ.చంద్రబాబునాయుడు పర్యవేక్షించారు.

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. 6వ తరగతి నుంచి 10 వ తరగతి బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

నక్కపల్లి: మండలంలోని దేవవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వేమగిరి నూకరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోటవురట్ల మండలం రాట్నాలపాలెం హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో దేవవరం విద్యార్థులు ప్రతిభను కనబరిచి, జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్ - 17 బాలుర విభాగం టెన్నికాయిట్ లో గింజాల గణేష్, అనుసూరి సతీష్, అండర్ - 14 బాలుర విభాగం టెన్నికాయిట్ లో మునుకుర్తి వెంకటేష్, గింజాల లోవరాజు, అండర్ - 17 బాలుర విభాగం త్రోబాల్ లో గింజాల గణేష్, అండర్ - 14 బాలుర విభాగం త్రోబాల్ లో మునుకుర్తి వెంకటేష్ ఎంపికయ్యారని హెచ్ఎం నూకరాజు వెల్లడించారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం నూకరాజుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు దుంగా నూకరాజు, పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

నక్కపల్లి కేజీబీవీ నుండి అండర్ - 17 బాలికల విభాగంలో కబడ్డీ పోటీల్లో ఐశ్వర్య, అండర్ - 14 కబడ్డీ పోటీల్లో సిహెచ్ కవిత, వి.దీపిక, ఖోఖో పోటీల్లో ఎం అనుష్క, పి త్రివేణి, అండర్ - 17 బాలికల విభాగం ఖోఖో పోటీల్లో పి.రేణుక జిల్లాస్థాయి ఆటలు పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారిణి షేక్ సలీమా తెలిపారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలోని సీతారామరాజు నగర్‌లో ఏర్పాటు చేసిన బాల వినాయక మండపం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా మండపం వద్ద పూజలు నిర్వహించారు.

భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: జగనన్న భు-హక్కు భూ-రక్ష పాస్ పుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలని కవగుంట గ్రామ సర్పంచ్ దాసరి సూర్యకుమారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, పలువురు రైతులు విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల కాలంలో కవగుంట, బుడ్డి బంద రెవెన్యూలో సర్వే ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం పాసుపుస్తకాలు తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి సుమారు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ రైతాంగానికి పంపిణీ చేయలేదన్నారు. కవగుంట పంచాయతీలో తప్పుల తడకలుగా సర్వే చేశారన్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి రైతులు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. సమస్య ఏర్పడిన రైతులకు సంబంధించిన పాసుపుస్తకాలను నిలుపుదల చేసుకొని మిగిలిన వారందరికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని నాలుగు పంచాయతీల్లో 6 వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఆన్ లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నక్కపల్లి -2 (ఓసి జనరల్), ఉద్దండపురం - 2 (ఓసి జనరల్), చిన్నదొడ్డిగల్లు(2) - 1 (బీసీ మహిళ), దోసలపాడు - 1(ఎస్సీ మహిళ) ఈ నాలుగు పంచాయతీల్లో వాలంటీర్ల పోస్టులు భర్తీ చేసేందుకు గాను ఈనెల 23, 24 తేదీల్లో ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరణ, 25 న దరఖాస్తులు పరిశీలన, 26 న మౌఖిక పరీక్ష, 27 న వాలంటీర్ల ఎంపిక వివరాలు వెల్లడి, 28 న నియామకం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు .నిబంధనలు మేరకు అర్హులైన నిరుద్యోగ యువతి ,యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు .

కోటవురట్ల:మండలంలో పాములవాక, అన్నవరం గ్రామాలలో ఒక్కొక్క వాలంటీర్ పోస్టుకు ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇత్తడి సప్పరం వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి సేవ నిర్వహించారు. ఆలయంలో ఆలయ అర్చకులు సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది గురవయ్య, రావూరి సురేష్, కొర్లాపు మహేష్, రేజేటి సింగరాచార్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న అర్చకులు



చేపడుతున్న పనులు

ఆయుర్వేద ఆసుపత్రిలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వేంపాడులోని ఆయుర్వేద ఆస్పత్రిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో ప్రభుత్వం ఆయుర్వేద ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలను కల్పించేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు 3 లక్షల నిధులతో ఆయుర్వేద ఆస్పత్రిలో అవసరమైన ఫర్నిచర్, తాగునీరు, సుమారు 60 అడుగుల రహదారి నిర్మాణం, వాష్ రూమ్ పనులు చేపట్టనున్నారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభిం చారు. ఎలమంచిలి ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్ కుమార్ ఇన్చార్జిగా ఈ పనులను తనిఖీ చేశారు. పీహెచ్ఎస్ పర్సన్ ఇన్ ఛార్జి అయినంపూడి మణిరాజు, సర్పంచ్ ఏడిది నూకరత్నం సహా కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

బాల్య వివాహాల నిర్మూలనకు

ప్రజాప్రతినిధులు సహకరించాలి

ం ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: బాల్య వివాహాలు పూర్తి నిర్మూలనలో ప్రజా ప్రతినిధుల అండదండలు తప్పనిసరని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారాం తెలిపారు. రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నిర్మూలన జరగాలంటే ప్రజాప్రతినిధుల పాత్ర శత శాతం అవసరం ఎంతైనా ఉందని సీతారాం అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ నర్సీపట్నం చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మేరీ సువార్త నేతృత్వంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, స్త్రీశిశు సంక్షేమ శాఖ, కైలాస్ సత్యార్థి ఫౌండేషన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు, విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సీడ్ సంస్థ బాల్య వివాహాలపై రూ పొందించిన వాల్ పోస్టర్లను సీతారాం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లోనూ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంలో వివిధ కార్యక్రమాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ ఏడాది ఆగస్ట్‌లోనే జిల్లా వ్యాప్తంగా 21 బాల్య వివాహాలు నిలుపుదలలో కృషి చేసిన అధికారులను ప్రశంసించారు. బాల్య వివాహాలను ఆపిన అనంతరం సంబంధిత బాలికలు ఎక్కడున్నారో పర్యవేక్షణ చేసి అవసరం అయితే మళ్లీ మాట్లాడాలన్నారు. ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలు తీసుకుని గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, వార్డుల అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు, అధికారులు ప్రత్యేక దృష్టితో చర్యలు చేపట్టాలని సూచించారు.

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారాం

మాట్లాడుతున్న సీతారాం

నర్సీపట్నం మునిసిపల్ చైర్పర్సన్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ, మునిసిపల్ కౌన్సిల్ పరిధిలోని కౌన్సిలర్లు బాల్య వివాహాల్లో పాల్గొనకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. బాల్య వివాహ రహిత మునిసిపాలిటీగా పేరు ప్రఖ్యాతలు తెస్తామన్నారు.

ఎంపిపి సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ మండల స్థాయిలో అంగన్వాడీ వర్కర్, గ్రామ సర్పంచ్ లు, ఎంపిటిసి, అధికారులు బాల్య వివాహాల నిర్మూలనకు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఐసిడిఎస్ నర్సీపట్నం సిడిపిఒ కె.మేరీ సువార్త మాట్లాడుతూ, అన్ని శాఖల సమన్వయంతో బాల్య వివాహాల నిలుపుదలకు సమాజంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పౌష్టికాహార స్టాల్స్ ను ఐసిడిఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నర్సీపట్నం మునిసిపల్ వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆదిలక్ష్మి, వైస్ ఎంపిపి రత్నం, తహశీల్దార్ అన్నాజీరావు, మునిసిపల్ కమిషనర్ కనకారావు, ఎంపిడిఒ.జయ మాధవి, సబ్ ఇన్స్పెక్టర్ ధనుంజయ్ ,సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సన్యాసి రాజు నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల విద్యాశాఖాధికారులు తలుపులు, పి.ఎస్.ఎన్.మూర్తి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సందర్శన

నర్సీపట్నం టౌన్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సందర్శించారు. ఆసుపత్రిలో పిల్లల వార్డును సందర్శిం చారు. పిల్లలకు అందుతున్న వైద్య సదుపాయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ పిల్లల అనారోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన మెరుగైన చికిత్సలను అందించాలన్నారు.

నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

బల్క్ డ్రగ్ యూనిట్ ఏర్పాటుపై

మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి- నక్కపల్లి: బల్క్ డ్రగ్ యూనిట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నెల కొల్పొద్దని మత్స్యకారులు డిమాండ్ చేశారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శుక్రవారం బల్క్ డ్రగ్ యూనిట్లు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు నిరసన తెలిపారు. తమ ప్రాంతంలో రసాయన తుల్య పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తీర ప్రాంతాల్లో బల్క్ డ్రగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో చేపలు వేట సాగగా, ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని ఆవేదన వెలిబుచ్చారు. కాకినాడ ప్రాంతంలో అక్కడ ప్రజానీకం బల్క్ డ్రగ్ యూనిట్ల ఏర్పాటును వ్యతిరేకిస్తే, ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి రాజేశ్వరి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ, పిఎంఇజీపీ కింద రుణాలు పొందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉత్తమ ఫలితాలను సాధించాలని, తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతిపెద్ద పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ పథక సంచాలకులు బి.లక్ష్మీపతి, ఎంఎల్ఓ చంద్రశేఖర్, డీపీఎం కుమార స్వామి, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఐపిఒ త్రివేణి, ఏపీఎం పార్వతి భాయ్, సీసీలు పాల్గొన్నారు

శ్రీ ప్రకాష్ విద్యార్థి దివ్య ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట: విశాఖపట్నంలోని ఎస్ ఎఫ్ఎస్ స్కూల్లో జరిగిన అండర్-17 బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థిని పి.దివ్య (10వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సి హెచ్. వి కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సి. హెచ్. విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం. వి. వి.ఎస్ మూర్తి అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థిని

ఆరోపణలపై విచారణ జరపండి

-కలెక్టర్‌కు జెడ్పిటిసి వినతి

ప్రజాశక్తి-గొలుగొండ: తనపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రవిపట్నాన్‌శెట్టికి గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, తాను 20 ఎకరాల భూమిని బినామీల పేరుతో అనుభవిస్తున్నానని, తన తండ్రి 50 సెంట్ల భూమిని కొనుగోలు చేస్తే ఎకరా భూమిని అనుభవిస్తున్నానంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది తనపై ఆరోపణలు చేశారని తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ పరంగా నిజనిర్ధారణ జరపాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించానన్నారు. వారు ఆరోపించిన బినామీ వ్యక్తులకు సంబంధించిన ఆధార్ కార్డులు, తన భూములకు సంబంధించిన పత్రాలను ఈ ఫిర్యాదుతో జత చేయడం జరిగిందన్నారు. తనపై దేశం నాయకులు చేసిన ఆరోపణలు నిజమైతే చట్టపరమైన చర్యలకు తాను సిద్ధంగా ఉన్నానని కలెక్టర్‌కు విన్నవించారు. టిడిపి నాయకులకు దమ్ముంటే తాను పోడు భూములు ఆక్రమించుకున్నట్లు రుజువు చేయాలని ఆయన సవాల్ విసిరారు. వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేయడం, బురద జల్లడం మానుకోవాలని గిరిబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు దొండా రాంబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, మండల యూత్ అధ్యక్షులు ఎం.రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి-రోలుగుంట: వరి పంటలో సమగ్ర యాజమాన్య చర్యలు చేపట్టడంపై బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు. శు క్రవారం మండలంలోని శరభవరం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో వరి పంటలో కీలక యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మిత్ర పురుగులను సంరక్షించుకోవడంతో పురుగుమందుల అవసరం లేకుండానే చీడపీడలను అదుపులో పెట్టవచ్చని, సకాలంలో కలుపు యాజమాన్యం ద్వారా తెగుళ్ల ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చన్నారు. కేవలం నిర్దేశించిన మోతాదులో మాత్రమే ఎరువులను వాడటంతో తెగుళ్ల రాకుండా చూసుకోవచ్చని వివరించారు. సాయంత్రం వేళ పొలంలో నీరు పూర్తిగా తీసేసి బాగా తడిచేలా పిచికారి చేయడంతో అధిక శాతం చీడపీడలను నియంత్రించవచ్చునని వివరించారు. మొదటి దఫా ఎరువులలో కచ్చితంగా 25 కిలోల పొటాష్ వాడడంతో తెగుళ్ల ఆశించడాన్ని నివారించవచ్చని, ఇప్పటికే పొటాష్ వాడకపోవడంతో చాలా పంటలలో, ముదురు ఆకుల చివర్ల నుంచి, అంచుల నుంచి ఎండిపోతున్నట్లుగా గమనించామని సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు అన్నారు. మిగిలిన 25 కిలోల పొటాష్ ఎరువులను అడుగు పొట్ట దశలో తప్పనిసరిగా వాడడంతో నాణ్యత పెంచవచ్చునని వివరించారు. కలుపు మందులను వినియోగించడం ద్వారా ఎకరాకు కేవలం 1500 రూపాయలతోనే కలుపును అదుపులో పెట్టవచ్చని సాంప్రదాయ పద్ధతిలో సుమారు నాలుగువేల పైనే ఖర్చు అవుతుందన్నారు. పొలంబడి విశేషాలను వ్యవసాయ అధికారిని విజయలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రావణి, ప్రకృతి వ్యవసాయ అధికారులు సాయి లక్ష్మి, సాంబమూర్తి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ టోర్నీ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ విశాఖ అసోసియేషన్, కెన్ ఫౌండేషన్, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ సహాయ సహకారాలతో విశాఖ నగరంలో అక్టోబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జరిగే అండర్ 11 జాతీయ స్థాయి చెస్ చాంపియన్‌షిప్ లోగోను టిడిపి మాజీ ఛైర్మన్, వైసిపి రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ టోర్నీలో 27 రాష్ట్రాలకు చెందిన 500 మందికిపైగా క్రీడాకారులు పాల్గొననున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఏసి ఇండోర్ స్టేడియం (విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్)లో ఈ పోటీలు జరుగనున్నట్లు వెల్లడించారు. ఈ ఛాంపియన్ షిప్‌కు కెకె.రాజు గౌరవ ప్రాటన్‌గా వ్యవహరించనున్నారని, వైశాఖి డెవలపర్స్, సంధ్యా మెరైన్స్ వారు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారని అసోసియేషన్ సభ్యులు కెవివి.శర్మ, భీమారావు, మునికంఠరావు, బాబూరావు తదితరులు తెలిపారు.

గిరిజనులపై

కొయ్యూరు జెడ్పిటిసి దాడి

తగదు: సిపిఎం

ప్రజాశక్తి -రోలుగుంట: అమాయకులైన గిరిజనులపై కొయ్యూరు వైసిపి జెడ్పీటీసీ వారా నూకరాజు దాడి చేయడం అన్యాయమని సిపిఎం మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంకె.పట్నం శివారు గ్రామం చటర్జీపురానికి చెందిన గిరిజనులపై దాడి అమానుషమన్నారు. గిరిజనులైన నీలాపు అప్పలనాయుడు, కేదారి రాజు, నీలాపు రాజేశ్వరి, నూకన్న నాలుగు కుటుంబాల వారు ఎన్నో ఏళ్ల నుండి ఆ భూమిని సాగు చేస్తున్నారన్నారు. భూమిని చదును చేసి ఒక రూపు తీసుకొన్ని పంట వేస్తే ఆ పంటను నాశనం చేయడం ఎంత వరకు సబబు అన్నారు. అధికార పార్టీ అండతో నాలుగేళ్లుగా వారిపై దౌర్జన్యకాండ చేయడం తగదన్నారు. రెవెన్యూ అధికారులు చేతులు తడిపి రికార్డులను తారుమారు చేయించి పోలీస్‌స్టేషన్ల చుట్టు తిప్పడం అన్యాయ మన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

విమ్స్‌కు 27 మంది వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రిలో తాజాగా 43 వైద్య పోస్టులకు నియామకాలు చేపట్టగా 27 మంది ఎంపికయ్యారని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపి మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు 43 పోస్టులకు 65 మంది అభ్యర్థులు వచ్చారని 27 పోస్టులు భర్తీకాగా, మిగిలిన 16 పోస్టులు రోస్టర్ పాయింట్ సరిపోకపోవడంతో భర్తీ కాలేదని వెల్లడించారు. వీటికి సంబంధించి ఏ విధంగా నియామకాలు చేపట్టాలనే అంశంపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నామన్నారు. ఎంపికైన వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే విమ్స్‌కు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు.